క్లుప్తంగా

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



ఆగిరిపల్లి: ఆధునిక సాంకేతికతను విద్యార్థులు అందిపుచ్చుకుని నూతన అన్వేషణపై దృష్టి సారించాలని ఎన్ఆర్ఐ కళాశాల చైర్మన్ వెంకట్రావు అన్నారు. మండల పరిధి పోతవరప్పాడులోని ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో జనరేటివ్ ఏఐ అండ్ ఎల్ఎంఎస్ అంశంపై ఇకోర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వారు విద్యార్థులకు శిక్షణ తరగతులు శనివారం నిర్వహించారు. విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు శిక్షణ తరగతులు దోహదపడతాయని ఎన్ఆర్ఐ కళాశాల చైర్మన్ ఆర్.వెంకట్రావు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగభాస్కర్, అకడమిక్ డైరెక్టర్ సాంబశివరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సురేంద్రబాబు పాల్గొన్నారు.

ఆరోగ్యమస్తు



జీళ్లకుంటలో ఫ్యామిలీ ఫిజిషియన్ ఆరోగ్య శిబిరం (ఫైల్)



వల్లంపట్లలో రోగి ఇంటి వద్ద చికిత్స చేస్తున్న వైద్యులు (ఫైల్)

- ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటివద్దకే వైద్యం
- దీర్ఘకాలిక రోగులకు ప్రయోజనం
- సత్వర వైద్యసేవలతో సత్ఫలితాలు
- తిరువూరు నియోజకవర్గంలో 15 వేల మందికి లబ్ధి

తిరువూరు: 'వృద్ధాప్యంలో ఉన్న తాను గతంలో ఆస్పత్రికి వెళ్లాలంటే ఇబ్బందులు పడేవాడిని. ఎవరిపైనైనా ఆధారపడి ఇంతకు ముందు పెద్దాస్పత్రికి వెళ్లి మందులు తెచ్చుకునేవాడిని. ఇప్పుడు మా ఇంటి వద్దకే డాక్టరు వస్తున్నారు. మా ఇబ్బందులు చెప్పుకుంటే మందులు ఇస్తున్నార'ని తిరువూరు మండలం వావిలాలకు చెందిన వెంకయ్య తెలిపారు. ఇదేవిధంగా గ్రామాల్లో అనారోగ్య కారణాలతో బాధపడేవారు ఆస్పత్రులకు వెళ్లడానికి చేతిలో డబ్బు లేక, తోడు ఎవరూ రాక పడుతున్న ఇబ్బందులను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటివద్దకే డాక్టర్ (ఫ్యామిలీ ఫిజీషియన్) కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. గత ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభించిన ఈ కార్యక్రమం తిరువూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ విజయవంతంగా అమలు చేస్తున్నారు. నెలవారీ షెడ్యూల్ ప్రకారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారితో పాటు ప్రత్యేక వైద్య నిపుణులు గ్రామంలో శిబిరాలు నిర్వహించి ఏఎన్ఎంలు ఇచ్చిన రిపోర్టుల ఆధారంగా ప్రత్యేక వైద్యచికిత్స అవసరం ఉన్న రోగుల ఇళ్లవద్దకు వెళతారు. అక్కడే అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నారు. ఇప్పటివరకు తిరువూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 15 వేల మంది రోగులకు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి చేకూరింది.

11 రకాల వ్యాధులకు చికిత్స

మధుమేహం, రక్తపోటు, దగ్గు, జలుబు, జ్వరం, గుండె, నేత్ర, దంత సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్య, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో చికిత్స అందిస్తారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న మందులతో పాటు అవసరమైన ఇతర మందులను కూడా ఉచితంగా అందజేస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి సమీప సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోగులను సిఫారసు చేస్తున్నారు. తిరువూరు మండలంలోని చౌటపల్లి, రాజుగూడెం, గంపలగూడెం మండలం ఊటుకూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలం తెల్లదేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం విజయవంతంగా అమలవుతోంది.

బీపీ, షుగర్ పరీక్షలు చేశారు



డాక్టర్లు మా ఊరికి ప్రతి నెలా వస్తారు. నాకు బీపీ, షుగర్ ఉండటంతో పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇచ్చారు. ఇంతకుముందు కొండూరు ఆరోగ్య కేంద్రానికి వెళ్లవలసి వచ్చేది. ఇప్పుడు మా గ్రామంలోనే అన్ని మందులూ ఇస్తున్నారు. నడవలేకపోతున్న మా వంటి వారికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంది. మా వంటి వారి ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు.

– జి. తిరుపతమ్మ, జీళ్లకుంట, ఎ.కొండూరు మండలం

మంచి వైద్యం చేస్తున్నారు



వృద్ధుడినైన నేను నడవలేక, అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రికి వెళ్లలేని పరిస్థితిలో మా వూరిలోనే డాక్టర్లు వచ్చి చికిత్స చేస్తున్నారు. గతంలో ఎవరి సాయంతోనైనా పెద్దాస్పత్రికి వెళ్లవలసి వచ్చేది. ఇప్పుడు ఆ బాధ తప్పింది. బీపీకి మందులు వాడుతున్నాను. మంచి కార్యక్రమం అమలు చేస్తున్న సీఎం జగన్ చల్లగా ఉండాలి.

–సి. ఏసోబు, జీళ్లకుంట

జెడ్పీ పాఠశాల ప్లస్ బాలికల ప్రతిభ



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జెడ్పీ పాఠశాల ప్లస్ బాలికలు ఇంటర్ మీడియెట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపారు. జూనియర్ ఇంటర్ సీఈసీ విద్యార్థిని ఎస్.శ్రావణి 446/500 మార్కులు, మరో విద్యార్థిని ఎస్. కల్యాణి ఎంపీసీ గ్రూపులో 444/500 మార్కులు సాధించారు. పాఠశాల స్థాయిలో ఆర్.మణితేజ ద్వితీయ స్థానంలో ఉత్తీర్ణత సాధించింది. నందిగామ ఉప విద్యాశాఖాధికారి వెంకటప్పయ్య, పాఠశాల ఉపాధ్యాయులు బాలికలను శాలువాతో సత్కరించి అభినందించారు. సెకండ్ ఇయర్‌లో కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేమంతా సిద్ధం బస్ యాత్రకు తరలిన ప్రజలు



కొండపల్లి నుంచి తరలివెళుతున్న నాయకులు, కార్యకర్తలు

ఇబ్రహీంపట్నం: మేమంతా సిద్ధం బస్సు యాత్రకు మండలంలోని వివిధ గ్రామాలు, కొండపల్లి మున్సిపాల్టీ ప్రాంతాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. శనివారం సాయంత్రం గుంటూరు జిల్లాలో బస్సు యాత్ర ముగించుకుని కనకదుర్గమ్మ వారధి మీదుగా విజయవాడ చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు వారు వివిధ వాహనాల ద్వారా బయలుదేరి వెళ్లారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు మేమంతా సిద్ధం అంటూ నినాదాలు చేశారు. పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య, కాంద్రకొండ గురవయ్య, పోరంకి శ్రీనివాసరాజు, ఆనంద్, బాలచందర్, ఎంఎ బేగ్ తదితరులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

తిరువూరు ఆర్డీఓ మాధవి



మాట్లాడుతున్న ఆర్డీఓ మాధవి

తిరువూరు: మే 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ కె. మాధవి అన్నారు. శనివారం తిరువూరు నియోజకవర్గంలోని ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణా కార్యక్రమాన్ని వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. రిసెప్షన్ కౌంటర్‌లో ఈవీఎంలు, ఓటర్ల జాబితాలు, ఇతర ఎన్నికల సామగ్రిని తీసుకుని, తిరిగి అప్పగించేవరకు ప్రతి క్షణం అధికారులు జాగ్రత్తగా ఉండాలని, చిన్న పొరపాటుకు సైతం బాధ్యత వహించాల్సి వస్తుందని చెప్పారు. ఈవీఎంలలో ఏదైనా సాంకేతిక సమస్య వస్తే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని, సమయపాలన ముఖ్యమన్నారు. జోనల్, రూట్ అధికారులు కూడా ప్రిసైడింగ్ అధికారులకు సహకరించి ఎన్నికలు సజావుగా పూర్తిచేయడంలో కీలక పాత్ర పోషించాలని చెప్పారు.

జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలి



గొడుగువారిగూడెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న చంటినాయన

నూజివీడు: హామీలు అమలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తనయుడు మేకా వేణుగోపాల అప్పారావు (చంటినాయన) ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని గొడుగువారిగూడెంలో శనివారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని ప్రజలకు వివరించారు. చంద్రబాబు చెప్పేవన్నీ మోసపూరిత హామీలేనని, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని తుంగలో తొక్కడం ఖాయమన్నారు. 2014లో 650 హామీలు ఇచ్చి ఆరు హామీలను కూడా అమలు చేయలేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావును గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

80 మంది ఉద్యోగాలకు ఎంపిక

విస్సన్నపేట: ప్రముఖ బహుళజాతి ఔషధ సంస్థ హెటిరో ల్యాబ్స్ ఆధ్వర్యంలో స్థానిక వికాస్ పీజీ కళాశాలలో శనివారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 80 మందిని ఎంపిక చేశారని కళాశాల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను నర్సిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో వికాస్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లా సుధీర్‌రెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె. రమేష్, డాక్టర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూంకు చేరిన ఈవీఎంలు

తిరువూరు: మే 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నిమిత్తం విజయవాడలోని జిల్లా ఎన్నికల గోడౌన్‌లో తొలి విడత పరిశీలన అనంతరం ఈవీఎంలను తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోని స్ట్రాంగ్‌రూంలో శనివారం భద్రపరిచారు. రిటర్నింగ్ అధికారి మాధవి పర్యవేక్షణలో రాజకీయ పార్టీల ప్రతినిధుల పరిశీలన అనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంలో ఉంచి సీలు వేశామని అధికారులు తెలిపారు.

అధ్యాపకుడికి డాక్టరేట్

తిరువూరు: స్థానిక శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం అధ్యాపకుడు జి. తేజస్వికి తమిళనాడులోని అన్నామలై విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ ప్రదానం చేసింది. విద్యుత్ రంగంలో ఆయన సమర్పించిన పరిశోధనా వ్యాసానికి పీహెచ్‌డీ లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో అధ్యాపకుడు తేజస్విని యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

చాట్రాయి: కొబ్బరి చెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బూరుగుగూడెం గ్రామానికి చెందిన తేళ్లూరి రమేష్ శనివారం చాట్రాయిలో కొబ్బరిచెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో నూజివీడు ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తిరువూరులో భువనేశ్వరి పర్యటన

తిరువూరు: గత ఆరు నెలలుగా నిర్వహిస్తున్న నిజం గెలవాలి కార్యక్రమం శనివారం తిరువూరులో ముగిసింది. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి తిరువూరులో జరిగిన ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. నియోజకవర్గంలోని కొండపర్వ, చీమలపాడు, పోలిశెట్టిపాడు, కాకర్ల, పాత తిరువూరులలో పలువురు కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన అనంతరం దారా టౌన్‌షిప్ ఆవరణలో ముగింపు సభ నిర్వహించారు. విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని, ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశానికి బీజేపీ డుమ్మా

కూటమిలో రగులుతున్న అసంతృప్తి జ్వాలలు

జూపూడి(ఇబ్రహీంపట్నం): కూటమిలో అసంతృప్తి జ్వాలలు రగులుతూనే ఉన్నాయి. రెండు రోజుల కిందట ఉమ్మడి అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ ప్రచార తీరుపై జనసేన పార్టీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కనీసం జనసేన నియోజకర్గ ఇన్‌చార్జ్‌కు కూడా సమాచారం ఇవ్వడం లేదని వారు ఆరోపించారు. శనివారం జూపూడిలో ఏర్పాటు చేసిన ప్రజాగళం ఆత్మీయ సమావేశానికి బీజేపీ నాయకులు హాజరుకాలేదు. ఈ పరిణామాలతో ఉమ్మడి కూటమిపై ప్రజల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరిస్తున్న చందంగా కూటమి తీరు ఉందని ఆ పార్టీ నాయకులే అనుకుంటున్నారనే చర్చ నడుస్తోంది. ఈమధ్య కాలం వరకు తన అనుచరులతో బూడిద, గ్రావెల్ తరలింపులో ప్రధాన భూమిక పోషించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ బూడిద తరలింపుపై ఆత్మీయ సమావేశంలో మాట్లాడి వైఎస్సార్ సీపీ నాయకులకు ఆపాదించడం ఆ పార్టీ నాయకులనే ఆలోచింపజేసింది. అవసరం ఉంటే ఓడ మల్లయ్య, అవసరం తీరాక బోడి మల్లయ్య సామెతగా వసంత కృష్ణప్రసాద్ మాటలు ఉన్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం



గోపాలపురం రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

ఎ.కొండూరు: మండలంలోని గోపాలపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన జానకి సమేత రామచంద్రస్వామి రామాలయంలో శనివారం విగ్రహ యంత్ర ధ్వజ స్తంభ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు రోజుల నుంచి మంగళ వాయిద్యాలతో శాంతి పటానం, దేవాలయానికి తోరణం, గణపతి పూజ, వాస్తుపూజ, శ్రీ జానకి సమేత రామచంద్రస్వామి, లక్ష్మణ, ఆంజనేయ స్వామి వారి సాయిబాబా విగ్రహ యంత్ర శిఖర జీవన ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవం, గణపతి పూజ, గోసహితంగా యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన హోమ కార్యక్రమం, మంగళహారతి, తీర్థ ప్రసాదం వితరణ నిర్వహించారు. స్వామివారి ప్రథమ దర్శనం, స్వామి వారి, అమ్మవారి శాంతి కల్యాణం, వేప చెట్టు, రావి చెట్టు కల్యాణం, జయాధి పూర్ణాహుతి హోమం, పలు రకాల పూజలు నాగబ్రహ్మాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం వేలాది మందికి అన్నదానం చేశారు. దేవాలయం కమిటీ వారు పర్యవేక్షించారు.

సంక్షిప్త వార్తలు

అంబేడ్కర్‌కు ఘన నివాళి

తిరువూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమం గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం. ఆదిలక్ష్మి మాట్లాడుతూ సామాజిక అసమానతలు తొలగించేందుకు, బడుగు, బలహీన వర్గాలకు చదువుల్లో, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కల్పనకు అంబేడ్కర్ చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు.

స్వచ్ఛందంగా వలంటీర్ల రాజీనామా

నూజివీడు: టీడీపీ, జనసేన కార్యకర్తలు, నాయకుల తీరుకు నిరసనగా నూజివీడు పట్టణంలోని 11, 12 వార్డులకు చెందిన 18 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ రొద్దం వెంకటరామిరెడ్డికి వలంటీర్లు తమ రాజీనామా లేఖలను అందజేశారు.

చాట్రాయి: మండలంలోని పోతనపల్లి, చాట్రాయి గ్రామాల్లోని 24 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. శనివారం ఎంపీడీఓ మంగా కుమారికి రాజీనామా పత్రాలను అందజేశారు. ప్రతిపక్ష నాయకులు మాపై చేస్తున్న ఆరోపణలకు మనస్థాపానికి గురై రాజీనామాలు చేస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు నాగరాజు నిస్సార్ అలీ పాల్గొన్నారు.

మునునూరు: అక్కిరెడ్డిగూడెం, వలసపల్లి, చెక్కపల్లి, బలివే తదితర గ్రామాలకు చెందిన ఏడుగురు గ్రామ వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ సీహెచ్ పద్మావతీదేవికి అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

జి.కొండూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ షబ్బీర్ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం.. జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామానికి చెందిన తాటి వెంకటేశ్వరరావు (53) అదే గ్రామానికి చెందిన ముత్యాల సుబ్బారావుతో కలిసి శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో రెస్టారెంట్‌కు వెళ్లేందుకు తమ ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. గ్రామ శివారులోని బైపాస్ రోడ్డు దాటుతున్న క్రమంలో కారు ఢీకొట్టడంతో గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన తాటి వెంకటేశ్వరరావు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో గాయపడిన మరో వ్యక్తి ముత్యాల సుబ్బారావు ఆరోగ్యం నిలకడగానే ఉందని పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడు సూర్యప్రకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు

తిరువూరు: మండలంలోని లక్ష్మీపురం వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈదురుగాలులకు రహదారిపై కూలిన చెట్టును గమనించకుండా ద్విచక్ర వాహనంపై వస్తున్న తిరువూరు మండలం పెద్దవరం గ్రామానికి చెందిన చైతన్య అదుపు తప్పి పడిపోయాడు. అతనితో పాటు బైక్‌పై ప్రయాణిస్తున్న భార్య శ్రావణికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. వీరిరువురిని తిరువూరు ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన చికిత్సకై విజయవాడ సిఫారసు చేశారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలుద్దాం

ఆగిరిపల్లి: ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు అన్నారు. శనివారం ఆగిరిపల్లి 7వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎంపీటీసీ సాదం గోపి, నాగుల్ మీరా, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కనబోయిన పండు, వాకా సక్కేశ్వరరావు, ఎస్కే సుభానీ, చిమట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామికి సర్నాల పూజలు

చంద్రాల(మైలవరం): చంద్రాల గ్రామంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు శనివారం పూజలు నిర్వహించారు. వేద పండితులు ప్రత్యేక పూజలు చేసి సర్నాల తిరుపతిరావు విజయం సాధించాలని ఆశీర్వదించారు. అనంతరం చంద్రాల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకులు జొన్నలగడ్డ గంగాధరరావును పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నాయకులు పాల్గొన్నారు.

ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శిక్షణ

మైలవరం: ప్రిసైడింగ్ ఆఫీసర్ల శిక్షణ కార్యక్రమం మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించారు. ఓటింగ్‌కి ముందు రోజు, పోలింగ్ రోజు నిర్వహించాల్సిన విధులపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.